అమెరి'కులాసా' కథలు – వంగూరి చిట్టెన్‌రాజు





అమెరికులాసా కథ – 219

డబ్బు పోలేదు... కానీ అకౌంట్ గోవిందా!

జీవితంలో కొన్ని సంఘటనలు జరుగుతున్నప్పుడు ఏడవాలో, నవ్వాలో అర్థం కాకపోవచ్చు. కానీ అవి జరిగిపోయిన తర్వాత మాత్రం — "అయ్యో పాపం, ఇదంతా నిజంగానే జరిగిందా?" అని నవ్వుకోవడానికి పనికొస్తాయి.

మొన్న మా బ్యాంక్ అకౌంట్ విషయంలో జరిగిన సంఘటన కూడా అలాంటిదే.

ఇక్కడ మా అకౌంట్ అంటే 90 శాతం మా క్వీన్ విక్టోరియాదీ, మిగతా చిల్లర నాదీ. అంటే — జాయింట్ అకౌంట్ అని బ్యాంకు చెబుతుంది, జాయింట్ బాధ్యత అనగా ఆదాయం నీదీ, ఖర్చు నాదీ అని క్వీన్ విక్టోరియా ఉవాచ.

ఆ రోజు అలవాటులో పొరపాటు కొద్దీ అకౌంట్ ఎలా ఉందో చూసేద్దాం అనుకుని లాప్‌టాప్ తెరిచాను. ఎప్పటిలాగే "ఆవిడ మొగుడు" అనే యూజర్ నేమ్, "అడ్డగాడిద" అనే పాస్‌వర్డ్ కొట్టగానే ఠకీమని ఎకౌంట్ తలుపు తెరుచుకోవాలి కదా? అదేమీ కాకుండా — పెద్ద ఎర్ర అక్షరాలతో:

"మీ అకౌంట్‌ను మా రక్షణ కవచం మూసివేసి మూసీ నదిలో పారవేసింది. ఎందుకో తెలుసుకోవాలని ఉంటే ఫలానా ఫోన్ నెంబర్ కి పిలవండి" అంటూ లాప్‌టాప్ గంట కొట్టడం మొదలెట్టింది. వెంటనే వంటింట్లోనుంచి క్వీన్ విక్టోరియా కూడా గంట కొట్టింది: "నా దేవుడి గదిలోకి నువ్వెందుకెళ్లావ్, హన్నా?"

ఆవిడ క్వెరీకి "లేదు అమ్మోయ్, బాబోయ్" అని అరిచేసి.. కంగారు పడుతూ కంప్యూటర్ లో వాళ్లు ఇచ్చిన టోల్ ఫ్రీ నెంబర్‌కి ఫోన్ చేశాను. నాలుగు పీకుళ్ళు, ఆరు నొక్కులూ అయ్యాక నన్ను పలకరించిన ఆ వియత్నామో, మన పవిత్ర భారతదేశమో కానీ ఆ కంప్యూటర్ అమ్మాయిలకి నా ప్రవర చెప్పుకున్నాక నేను నిజంగా నేనే అని నిర్ధారణ చేసుకున్నాక వాళ్లు చెప్పిన సంగతి:

"మీ అకౌంట్ నుంచి ఎవరో $9,700 దొంగిలించడానికి ప్రయత్నించారు."

అంటే —— దొంగగారు మా అకౌంట్ మీద కన్నేసి, పెద్ద కన్నమే వెయ్యడానికి ప్రయత్నించాడు.

కానీ మన దొంగ లెక్కలో ఒక చిన్న పొరపాటు ఉంది. మా బ్యాంకు వాళ్లు అంత అమాయకులు కాదు!

ఆ దొంగ దొంగతనంగా దొంగ పేరుతో ఆ డబ్బు మా ఎకౌంట్ నుంచి తన ఎకౌంట్ కి వైర్ ట్రాన్స్ ఫర్ చెయ్యబోయాడో....వాటితో మాకు ఎప్పుడూ లావాదేవీలు లేవు కాబట్టి వాళ్లకు ఆ $9,700 లావాదేవీ అనుమానంగా అనిపించింది. వెంటనే బదిలీని ఆపేశారు. అంతేకాదు —— "తస్మాత్ జాగ్రత్త" అనుకుని అని మా అకౌంట్ కి చుట్టూ తాళాలు వేసేశారు..అంటే ఫ్రీజ్ చేసేశారు.

అనకూడదు కానీ ఇక్కడే నా బుర్రలో అసలు కామెడీ మొదలైంది. తాళం బద్దలు కొట్టి ఆ దొంగ అమ్మాయో. అబ్బాయో, మరొక లాంటి దో లోపలికి వచ్చేసి, మా క్వీన్ విక్టోరియా సొమ్ముతో ఉడాయించబోయి పట్టుబడ్డారు కదా...సొమ్ము అక్కడే పారేశారు కదా... దొంగలు పడ్డాక తాళం వెయ్యడం ఎందుకుటా?

నేను బుర్ర గోక్కుంటూ ఉండగానే అంతలో మా క్వీన్ విక్టోరియా పరిగెత్తుకుంటూ వచ్చింది:

"ఇదిగో నీ సుపుత్రుడు ఫోన్‌లో ఉన్నాడు... ఏదో బ్యాంక్ గొడవట!"

నేను సవ్యసాచిలా ఫోన్ అందుకుని "ఏమిట్రా నీ గోల?" అని విసుక్కున్నాను.

వాడు అంత కంటే విసుగ్గా.."నా గోల నీదే! ఇప్పుడే మీ అకౌంట్‌కి వంద డాలర్లు జల్ల కొట్టాను. 'ఎకౌంట్ క్లోజ్డ్' అని మెసేజ్ వచ్చింది. ఏమిటి, మా నాన్న దివాళా తీసేశాడా?" అన్నాడు.

అంతలో మా ఎలక్ట్రిక్ బిల్లు, నీళ్ళ బిల్లు వాళ్ల దగ్గర నుంచీ కూడా "మీ అకౌంట్ మూసివేయబడింది" అని మెసేజ్‌లు రావడం మొదలయి నా లాప్ టాప్ మళ్ళీ గంట వాయించడం మొదలెట్టింది. పొగలు రావడమే ఆలస్యం. ఇప్పుడు నా పక్కనే ఉంది కాబట్టి ఈ సారి విక్టోరియా మహారాణి తన దేవుడి గది ప్రస్తావన తీసుకు రాకుండా నాకేసి, కంప్యూటర్ తెర కేసి విస్తు పోయి చూడడం మొదలెట్టింది.

ఎందుకంటే...మా ఎకౌంట్ అటక ఎక్కిన సంగతి ప్రపంచవ్యాప్తంగా అందరికీ తెలిసిపోయాకే ఆ శుభవార్త మాకు తెలిసింది!

అప్పుడు నాకు అర్థమైంది:

ఇంట్లో దొంగ పడకుండా ఉండడానికి మనం తలుపులు వేసుకుంటాం. బ్యాంకులో దొంగ పడితే —— బ్యాంకు మన తలుపులకే తాళం వేస్తుంది!

చివరికి ఆ అకౌంట్‌ను మళ్లీ మామూలు స్థితికి తీసుకురావడానికి మేము పడిన పాట్లు... అది మరో అమెరికులాసా కథ!

★★★★

COMMENTS